# గాయత్రి

ఆ రోజు మహా శివరాత్రి. నా నిత్య పూజాదికాలతో పాటుగా శివునికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశాను. పంచాయతనమునకు నైవేద్యం వుంచి, కొద్ది క్షణాలు ఆగి నేను కూడా ఆ ప్రసాదాన్ని సేవించి, భగవంతుని ఎదుట కనులుమూసుకొని, తన్మయుడనై వున్న సమయంలో........

" నాన్నగారూ ! " మా అమ్మాయి గాయత్రి.

" ఏమిటి తల్లీ ? "

" మీ కోసం ఒక పిల్లవాడు వచ్చేడు. "

ఆ ఊరిలో సామాన్యంగా నా కోసం తిథి వారనక్షత్రాలు చూసి పెట్టమని, ఏదో ఒక శుభకార్యానికి మంచి రోజు చూడమని, పెద్దలే వస్తారు. కాని చిన్నవాడు రావటం ఏమిటీ ? నా మనసు ప్రశ్నించింది. అందుకు బదులుగా,

బయట వరండాలో ఇస్త్రీలేని తెల్లని బట్టలు వేసుకుని, వినయంగా చేతులు కట్టుకుని నిలబడి వున్నాడు అతను. అతని నుదుట విభూతి రేఖలు మధ్యన ఎఱ్ఱని కుంకుమ బొట్టు.

అతని వయసు సుమారు ఎనిమిది సంవత్సరాలు వుంటుంది. గులాబి రంగులో, కన్నెపిల్లలకు మెరిసిపోయే గులాబీల్లా అతనిబుగ్గలు, అతని కళ్ళల్లో తేజస్సు. అంత పిన్న వయస్సులోనే మతం అంటే గల గౌరవాభిమానాలకు ముగ్ధుణ్ణి అయ్యాను.

నా మనసు పరవశంతో ఊగిసలాడింది, అతని ముఖారవిందం చూసేక. సనాతన ధర్మాలను, ఆచార వ్యవహారాలను ప్రజ పూర్తిగా మరిచిపోయి ఎవరి ఇష్టంవచ్చినట్లు వాళ్ళు ప్రవర్తించే ఈ రోజుల్లో ఇటువంటి పిల్లవాడు నాకు ఎదురవడం ఏమిటి ?

నేను కనపడగానే—

"నమస్కారం !"

"ఏమిటి నాయనా, నావల్ల నీకేం కావాలి ?"

"నాకు అర్హత వున్నది లేనిది స్పష్టంగా తెలియదు. అయినా నాకు ఒక కోరిక కలిగింది. తమర్ని అడిగి వెళ్దామని వచ్చాను."

"ఏమిటి నాయనా అది ?"

"నాకు గాయత్రి మన్త్రం నేర్పండి గురువుగారూ. మిమ్మల్ని గురువుగారూ అని పిలువవచ్చునో లేదో తెలియదు- అయినా పిలుస్తున్నాను."

"బాబూ నువ్వు ఎవరి అబ్బాయివి ?"

"మా నాన్నగారు చనిపోయారండి. అమ్మ మాత్రం వుంది. మా కులం—"

" ఆగు బాబూ. " నాలోని ఉత్సాహం నిప్పులపై నీళ్ళు చల్లినట్లయింది.

" అన్యథా భావించకు నాయనా. నీకు గాయత్రి నేర్పడానికి వీలులేదు " నా కంఠం కఠోరంగా మారింది.

" ఎందుకు గురువుగారూ ? "

" బాబూ గాయత్రి జపించడానికి నియమ నిష్ఠలు కావాలి. అందుకని ఆ నిత్యకర్మ, ఆచార వ్యవహారాలు నియమ నిష్ఠలు పాటించే కొన్ని కులాలకు మాత్రమే పరిమితమైంది. అయితే త్రిసంధ్యలు వార్చకుండా నిదురపోలేనివారు, అలా చేయకపోతే వెలితిగా బాధపడేవారు, ఆ అర్హతగల కులాలలో కూడా బహు కొద్దిమందే వున్నారు. అందుకు విచారించవలసి వుంది. ఎంతో ఉత్సాహంతో వచ్చావు. నిరుత్సాహ పరుస్తున్నాను మన్నించు బాబూ. "

" అయ్యగారూ !మీతో వాదిస్తున్నందుకు క్షమించండి. చిన్న సందేహం నాకు. "

" చెప్పు బాబూ. "

" మేము మీతో సమానంగా శాఖాహారులం. నేను రోజూ ఉదయం స్నానం చేసి భగవంతుని ధ్యానించకుండా ఏమీ తీసుకోను. మా అమ్మగారు కూడా అంతే. నేను సాయంకాలం కూడా పూజచేస్తాను. ఆచార వ్యవహారాలలో మార్పులేనప్పుడు నేను ఎందుకు గాయత్రీ జపవిధానం నేర్చుకోకూడదు ? "

"బాబూ, నాకు కొన్ని నియమ నిబంధనలు వున్నాయి. బ్రాహ్మణేతరులకు నేను గాయత్రీ మంత్రం చెప్పలేను. నా కంటే చిన్నవాడివైనా నన్ను మన్నించి వెళ్ళు బాబూ." అన్నాను ఉద్వేగంతో

అతని ముఖంలో నైరాశ్యం—

ఏదో కోల్పోయినట్లుగా వెళ్ళిపోతున్న ఆ పిల్లవాడిని అశక్తుడనై చూస్తున్నాను.

కొన్ని సందర్భాలలో, మన ఆశయాలను ఆచరణలో పెట్టడానికి, మనం తీసుకున్న నిర్ణయాలను, నిశ్చయమైన అభిప్రాయాలను అతిక్రమించకుండా వుండాలంటే ఒక్కొక్కసారి ఎదుటివ్యక్తిని నొప్పించవలసి వస్తుంది. తప్పదు మరి.

అప్పుడే కదా మానవునిలో పరిపక్వత ఏర్పడి, పరిపూర్ణుడు అయ్యేది.

అయితే ప్రతీ వ్యక్తి ఇలా ప్రవర్తించి పరిపూర్ణుడు అయ్యాడా అంటే చెప్పలేను.

## 2

నేను నిత్యం భగవంతుని ఆరాధిస్తున్నానే. నిత్యం చేసే కార్యక్రమాలలో విఘ్నం కలుగకుండా గణేశుని—

కావలసిన ధనం చేకూర్చమని ధనలక్ష్మిని — విజ్ఞానానికి విద్యనొసంగమని సరస్వతిని

ఏడుకొండలవానిని,

సత్యనారాయణస్వామిని,

కంచి కామాక్షిని.

కనకదుర్గను,

ఇలా ఎంతమంది దేముళ్ళు? దేవతలు? పైగా అక్కడక్కడ వెలసిన బాబాలు.

వీరందరిలో ఎవరిని ఆరాధించినా, సర్వాంతర్యామిని చేరుకుంటాయి మన ప్రార్థనలు.

కాని నా మనసులో ఒకటి ప్రశ్నగా మిగిలిపోయింది.

బాబాలు నేనే దేవుణ్ణి అని ప్రకటించుకుంటూ, మరి తాము గణేశుని, దుర్గామాతను మిగతా దేముళ్ళను ఎందుకు పూజ చేస్తారో.

మరి ఇన్ని పూజలు, పునస్కారాలు, క్షణం క్షణం భగవన్నామ స్మరణ చేసే నాకు ఏం జరగలేదేమిటి అని బాధ పడుతుంటారు కొందరు.

ఏం జరగాలి?

లక్షలకు అధిపతి అయి, తమ తీరని కోరికలన్నీ తీరాలా?

లేదా తాము ఒక్కసారి ఉన్నత స్థితికి ఎదిగిపోవాలా?

ఏమిటో—

తీరికగా కూర్చున్నప్పుడు నా మనసు ఆలోచించేది ఇటువంటి ఆలోచనలే.

కె. బి. కృష్ణ

నా కుమార్తె గాయత్రి వివాహం గురించి గాని—

నా మరణానంతరం నా కుటుంబ పరిస్థితి గాని—

నేను ఏమి సంపాదించుకున్నాను అని గాని——

ఎప్పుడూ ఆలోచించలేదు.

కారణం——

భగవంతుడు సంపూర్ణంగా నా హృదయంలో, మనస్సులో, ఆలోచనా తరంగాలను స్పదింపచేసే మెదడులో నిండిపోయి వుండటంతో స్వార్థం గురించి ఆలోచించే సమయం నాకు లేదు.

ఇలా సాగిపోయిన నా జీవితంలో ఎనిమిది వసంతాలు గడిచేయి.

గాయత్రి వివాహమైంది. ఆమెను అత్తవారింటికి పంపివేశాను

నేనూ, నా ధర్మపత్ని ఇద్దరం మిగిలేము ఇంటిలో.

అప్పుడప్పుడు వేదసభలకు వెళ్ళడం. ఉపన్యాసాలు ఇవ్వడం, లేదా భగవన్నామస్మరణం. స్థానిక దేవస్థానం ప్రతినెలా వేద పండితులకు ఇచ్చే భరణం తీసుకుని బ్రతుకు గడపడం. జీవించడానికి ఆహారం సేవించడం ఇలా జరిగిపోతూంది.

ఆ రోజు మాస శివరాత్రి. వయసు పైబడినా అలవాట్లు, నిత్య పూజాదికాలు వదిలిపెట్టలేదు. అది చాదస్తమంటుంది నా ధర్మపత్ని. నేను మాత్రం కర్తవ్యం అంటాను. పైగా భగవంతుడు ఈ శరీరంలో అణువణువూ కదిలించగలిగే శక్తి నాకు ఇచ్చినంతవరకూ ఆయనను ఆరాధించాలని నిర్ణయం చేసుకున్నాను.

నా ఆలోచనలను భగ్నం చేస్తూ లక్ష్మీనారాయణగారు వచ్చారు.

ఆయన హిందూ ధర్మం నశిస్తున్న ఈరోజుల్లో, సనాతనాచారాలను ధర్మాలను ప్రజలు మరిచిపోకుండా, ప్రజలను జాగృతం చేయడానికి కంకణం కట్టుకున్న మహానుభావుడు.

హిందూ ధర్మ ప్రచార సంఘ కార్యదర్శి ఆయన.

" గురుభ్యోనమః "

" శివార్పణం. ఏమిటి మళ్ళా ఏం కార్యక్రమం ఏర్పాటు చేశారు ? "

" ఈ సారి ఇంతవరకూ ఎవరూ నిర్వహించని ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని మనసుపడాను. అందుకు మీ సహకారం కావాలి. "

ఆయన ఏ కార్యక్రమం నిర్వహించినా అది ఒకక్రొత్త ప్రయోగమే.

ఒకసారి భగవద్గీతను చూడకుండా పద్దెనిమిది అధ్యాయాలు ధారాళంగా చెప్పే పోటీ పదిహేను సంవత్సరాల పిల్లలకు ఏర్పాటు చేశారు. అది ఒక అపూర్వమైన కార్యక్రమం.

మరొకసారి విష్ణు సహస్రనామం.

ఇంకొకసారి లలితా సహస్రనామం.

ఇలా చెప్పుకుపోతూంటే ఎన్నో ఉన్నాయి.

ఈసారి మరి ఏ కార్యక్రమమో మరి.

"మీరు నిర్వహించే ఏ కార్యక్రమానికైనా సహాయం, సహకారాలు ఎల్లప్పుడూ వుంటాయి."

"పదహారు-పద్దెనిమిది సంవత్సరాల మధ్య వయసుగల యువకులకు 'సాయం సంధ్యావందనం' పోటీ పెట్టాను. సమాజంలో ఎంతమంది యువకులు సంధ్యావందనం ఆచరిస్తున్నారో, అసలు మర్చిపోయారో అని నాకు అనుమానం. ఈ అనుమానం నివృత్తి చేసుకోడానికి ఈ పోటీ ఏర్పాటు చేశాను. దీనికి మీరే న్యాయ నిర్ణేతలు, ఏమంటారు?"

"మరి-"

"పోటీకి వచ్చే కొంతమంది ప్రముఖులు, న్యాయ నిర్ణేతలు, పోటీలో పాల్గొనే యువకులు, కూర్చునేందుకు హాలులో ఏర్పాటు చేశాను. నాలుగు గోడల మధ్యననే ఏర్పాటు చేశాను. మీ సందేహం నాకు అర్థమైంది. గాయత్రి మంత్రోచ్చారణ, మిగతా కార్యక్రమాలకు అభ్యంతరం వుండదనుకుంటాను"

"అలా అయితే ఫర్వాలేదు మరి ఎప్పుడు ఏర్పాటు చేశారు?"

"ఇంకొక వారం రోజులు వుంది. తమకు చెప్పి పోదామని వచ్చాను."

"అలాగే"

"శెలవ్" అంటూ వెళ్ళిపోయారాయన.

ఆయన వెళ్ళాక నా మనసు ఆనందంలో ఉరకలు వేసింది.

గాయత్రి మంత్రం అన్నా-

సంధ్యావందనం అన్నా-

నాకు ప్రాణం. ఆ గాయత్రీమతల్లి మహిమవల్లనే, ఆ చల్లని తల్లి వల్లనే నేను ఈ రోజు ఇలాగు బ్రతికి బట్టకడుతున్నాననే దృఢ విశ్వాసం నాకు వుంది.

అయ్యో సమయానికి అమ్మాయి గాయత్రి లేక పోయిందే అనుకున్నాను. దానికి గాయత్రీ మన్త్రం అంటే ఎంత ఇష్టమో.

'నాన్నగారూ పూర్వకాలంలో బ్రాహ్మణ, క్షత్రియ స్త్రీలకు కూడా ఉపనయనం చేసేవారని, వాళ్ళు వేదాలు పఠించేవారని, వాళ్ళు అందరికీ గాయత్రి మన్త్రం ఉపదేశించేవారిని మనుస్మృతిలో వ్రాసి వుంది కదా, నాకు ఎందుకు ఉపనయనం చెయ్యరు?' అని అడిగేది.

అలా అడిగి ఊరికే వుండలేదు, పుష్పవతి అయ్యేవరకు గాయత్రి మన్త్రం జపించింది.

'నాన్నగారూ గాయత్రికి మైల పనికి రాదని' తానే మానివేసింది తరువాత.

నేను నా అత్యంత ప్రీతిపాత్రమైన దేవత గాయత్రిని అనుక్షణం ఉచ్చరించడానికి వీలుగా ఆమె పేరును 'గాయత్రి'గా నిర్ణయించాను.

అటువంటి నా తల్లి గాయత్రి నా దగ్గర వుంటే ఎంత ఆనందిస్తుంది అనుకుని అల్లుడికి కార్డు వ్రాసి పడేశాను అమ్మాయిని పంపమని.

మనకు అత్యంత ప్రీతిపాత్రమైన తినుబండారం భుజించేటప్పుడు గాని, సుమనోహర దృశ్యం చూసేటప్పుడు గాని, మన ఆత్మీయులు

అందరూ గుర్తుకు వస్తారు. వాళ్ళు అందరూ కూడా ఈ అనుభూతిని పొందితే ఎంత బాగుంటుంది అనిపిస్తుంది.

భగవంతుడు ఏర్పాటు చేసిన ఒక మహోన్నతమైన మానసిక పరిపక్వత. పరిపక్వత ఇది—

# 3

అది ఒక పెద్ద హాలు.

ఆ హాలులో ఒక ఎత్తైన వేదిక.

ఆ వేదికకు ఎదురుగా న్యాయనిర్ణేతలకు ఉచితాసనాలు ఏర్పాటు చేశారు.

నేను ఆ హాలులో ప్రవేశించగానే లక్ష్మీనారాయణగారు ఎదురుగా వచ్చి నన్ను లోపలకు ఆహ్వానించి నన్ను న్యాయనిర్ణేతల స్థలంలో కూర్చోపెట్టారు,

ముగ్గురు న్యాయనిర్ణేతల నిర్ణయం తరువాత, నన్ను ముఖ్య న్యాయనిర్ణేతగా ఏర్పాటు చేశారుట.

సుమారు పాతికమంది పోటీలో పాల్గొనడానికి వస్తే, ఉదయమే ముగ్గురి న్యాయనిర్ణేతల సమక్షంలో పోటీ ఏర్పాటుచేసి, వారిలో ముగ్గుర్ని ఎన్నిక చేశారుట. వారిలో నేను ఇప్పుడు ప్రధాన న్యాయ నిర్ణేతగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎన్నిక చేయాలి. నా కర్తవ్యాన్ని కొంతవరకు సుగమం చేశారనే చెప్పాలి.

ఉదయం పోటీలో ఎన్నికచేసిన ముగ్గురు యువకులను చూశాను.

ఒక యువకుడు పట్టు ధోవతి ధరించి, పైన ఉత్తరీయం వేసుకున్నాడు—అతను రమణ.

మరియొకడు సిల్కు ధోవతి ధరించి, పైన ఉత్తరీయం వేసుకున్నాడు—అతడు శివం.

ఇంకొక యువకుడు ఖావీ (నారతో తయారుచేయబడిన వస్త్రం) కట్టుకుని పైన ఉత్తరీయం వేసుకున్నాడు. అతను శ్రీశైలమూర్తి.

ముగ్గురి నుదుట విభూతి రేఖలు, మధ్యలో గంధపు బొట్టు' ఆ పైన కుంకుమ బొట్టు.

ఆ కుంకుమ వారి ముఖారవిందాలలో వెలిగే చిన్న జ్యోతిలా కనిపించింది.

నుదుట విభూతి రేఖల మధ్యన అలంకరించబడే కుంకుమకు ఎంతటి వెలుగు వుంది అనుకున్నాను.

నాకు ముగ్గురిలోనూ ఖావీ ధరించిన యువకుని ముఖంలో దివ్య తేజస్సు కనుపించింది. అతని శరీరనిర్మాణం నాకు ఎందుకో ప్రత్యేకత సంతరించు కున్నట్లు అనిపించింది.

నిర్వాహకులు లక్ష్మీనారాయణగారు వేదిక ఎక్కి ఉదయం నుండి జరిగిన కార్యక్రమాలు, సుమారు పాతిక మందిలో ముగ్గురిని ఎన్నిక చేసిన పైనం, ఆ ముగ్గురిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఇప్పుడు ఎన్నికచేయడం జరుగుతుందని చెప్పారు.

ముందుగా రమణను వేదికపైకి ఆహ్వానించారు.

ఓం—

ప్రణవనాదం నా మనసును సుమారలోకాలకు తీసుకుని పోతూంది. కనులు మూసుకుని ఆ సంధ్యావందన విధానం వింటున్నాను.

గురుప్రార్థనతో ప్రారంభించి ఈశ్వరార్పణమ్ వరకు నిరాటంకంగా కొనసాగించాడు ఆ యువకుడు. అయితే నాకు అతని మంత్రోచ్చారణలో అక్కడక్కడ స్వరదోషము, ముద్రాభినయంలో చిన్న పొరపాట్లు గోచరించాయి.

తరువాత శివం వేదిక ఎక్కాడు.

ఓం—

ఓంకార నాదం నా చెవులలో మలయ మారుతంలా హాయిగా వినిపిస్తోంది.

ఇతను కూడా గురు ప్రార్థనతో మొదలుపెట్టి ఈశ్వరార్పణమ్ వరకు యధావిధిగా మంత్రవిధానం చదివేసు. సుస్వరంగా నిర్వర్తించాడు సంధ్యావందనాన్ని. అయితే ఇతనిలో వున్నది ఒకే ఒక లోపం. అది అతని కంఠంలో శ్రావ్యత లేకపోవడం.

నాకు నిరాశ జనించింది.

అయ్యో ఈ ముగ్గురిలో ఎవరూ ప్రథమ బహుమతికి అర్హులు కాకపోతే, తప్పనిసరిగా ఎవరికో ఒకరికి ఇవ్వవలసి వస్తుందేమో. అనర్హులకు బహుమతి ఎలా ఇవ్వాలి. సరే ఇంకొకరు వున్నారుకదా.

చివరగా శ్రీశైలమూర్తి లేచి నిలబడి వేదిక వద్దకు వెళ్ళకుండా, ముందుగా నాదగ్గరకు వచ్చి పాదాభివందనంచేసి "గురుభ్యోనమః" అని వేదికపైకి వెళ్ళాడు. అతని నమ్రతకు నా మనసు పరవశంతో ఊగిసలాడింది.

ఓం—

ఆనందంతో కళ్ళు మూసుకొన్నాను.

గాయత్రి ధ్యానమ్ మొదలుపెట్టాడు.

"సుముఖం సంపుటం చైవ-" అని మొదలుపెట్టి గాయత్రీమాత ఇరువది నాలుగు ముద్రలు, ఆ పదహారు వసంతాల పిల్లవాడు అభినయిస్తుంటే హృదయం ఆనందంతో నాట్యం చేసింది.

అతని బాహువులు ఎంత చక్కగా నిర్మితమయ్యాయి ? అతను ముద్రలు అభినయించేటప్పుడు చేతులు త్రిప్పుతుంటే లయప్రకారం నాట్యంచేసే నాట్యాచార్యుడు గోచరించాడు నాకు అతనిలో.

గురు నమస్కారం చేస్తూ నా వైపు చూస్తున్నాడు.

నా పట్ల అతనికి గల గౌరవానికి ముగ్ధుణయి 'చిరంజీవ—చిరంజీవ' అనుకున్నాను మనస్సులో.

కనులు మూసుకుని ఆ పిల్లవాడు గాయత్రి జపిస్తుంటే అతనిలో నాకు గాయత్రి తల్లి కనుపించింది. ధ్యానంలోవున్న అతని కనులు వెలుగుతున్నట్లు కనుపించాయి.

కె. బి. కృష్ణ

మంత్రోచ్చారణ చేస్తున్నప్పుడు ఖంగుఖంగు మంటున్న అతని గొంతుతో పాటుగా, అతని విశాలమైన ఛాతీ ఎగసి పడుతుంటే, ఆ దృశ్యం చూడటానికి మనోహరంగా వుంది.

అనాలోచితంగా 'శెభాష్ శెభాష్' అనేశాను నెమ్మదిగా.

అతను ప్రవర పూర్తిచేసి, ఈశ్వరార్పణమ్ నిర్వహిస్తున్నాడు.

ముత్యపు వర్ణము, పగడపు వర్ణము, బంగారు వర్ణము, తెల్లని వర్ణము గల ఐదు ముఖములు కలిగినట్టియు, కిరీటమునందు చంద్రకళ కలదియు, బ్రహ్మ పదార్థమనే ఆత్మ కలదియు. వరప్రదానము, అభయము, అంకుశము, కొరడా, తెల్లని బ్రహ్మకపాలమును, గద, శంఖము, చక్రము, రెండు పద్మములను పదిచేతులతో ధరించియున్న. దేదీప్యమానంగా వెలిగి పోతున్న గాయత్రీదేవి అతనిలో గోచరించింది నాకు.

ఎన్ని నాళ్ళకు నా చెవులలో శంఖం పూరించబడింది.

హైందవ సంస్కృతి

యజ్ఞోపవీత ధారణ

ఇవన్నీ మరుగున పడిపోతున్న యీ కలికాలంలో ఎటువంటి యువకుడు ఆవిష్కృవించాడు ? ఇతను ఎవరి పిల్లవాడు ? వాకబు చేయాలి అనుకున్నాను.

ఖంగుమనే అతని కంఠంలో సుస్వరమైన మంత్రోచ్చారణ సంగీతంలో సరిగమలులా వొదిగి పోయిందనిపించింది నాకు-

ఆ యువకుడు వేదిక ఎదురుగా వున్న పెద్దలకు నమస్సులు అర్పించి దిగి తన స్థానంలో కూర్చున్నాడు.

కొంత వ్యవధిలో అదే హాలులో సభ ఏర్పాటుచేశారు.

పోటీలో బహుమతి పొందిన యువకులకు బహుమతి ప్రదానం మరియు ఉపన్యాసాలు.

సభకు చాలా ఎక్కువ మందే వచ్చారు.

వేదిక పైకి నన్ను ఆహ్వానించారు మరొక పుర ప్రముఖులు. కార్యక్రమ నిర్వాహకులు కూడా వేదిక నలంకరించారు.

ప్రార్థన అనంతరం నన్ను ఉపన్యసించమన్నారు.

" సభాయనమః "

" హైందవ ధర్మాన్ని మించిన ధర్మం ఈ ప్రపంచంలో మరొకటి లేదు. అది నిర్వివాదాంశం.

అయితే........

కొన్ని ప్రలోభాలకు లొంగిపోయి హిందువులు పరమతాలవైపు ఆకర్షితులవుతున్నారు. ఇది నా గుండెల్లో ముల్లుగుచ్చుకున్నట్లుగా బాధ. వృద్ధాప్యం వలన ఏమీ చేయలేని నిస్సహాయత.

అటువంటి బాధలో___

ఈ నిర్వాహకులు లోగడ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఇంతకుముందు నిర్వహించిన కార్యక్రమాల కన్న ఇది మహోత్కృష్ట

మైనది. ఎందుకంటే మానవునికి శక్తినిచ్చేది గాయత్రి. ఆ గాయత్రి మంత్రం జప విధానంలోనే పోటీ ఏర్పాటు చేశారు. నిర్వాహకులను అందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

కాని—

ప్రస్తుత సమాజం ఎలా వుంది ?

నుదుట విభూతి రేఖలు, మధ్యలో గంధం, పైన కుంకుమ ఉంచుకుని కార్యాలయానికి గాని బయటకు గాని వెళితే ఎగతాళిచేసే వ్యక్తులు 'వీడు కదా పరమ భక్తుడు' అని గేళిచేసే మనస్తత్వం ప్రబలిపోయింది.

యజ్ఞోపవీతాన్నితీసి బట్టలు తగిలించుకునే చిలుకకొయ్యకు వ్రేలాడ దీసే మనస్తత్వం వున్న ఈ సమాజంలో గాయత్రి మంత్రం గురించి ఎవరికి తెలుసులే అనుకుని వుంటారు మీరందరూ.

ఉదయం నుండి సుమారు పాతిక మంది ఈ చిన్న పట్నంలో ఈ పోటీకి వచ్చేరని నిర్వాహకులు చెప్పారు.

నా మనస్సు సంతోషంతో, ఈ ఓంకారనాదంతో, మలయమారుతానికి నెమలి నాట్యంచేసినట్లు నర్తించింది.

నా జన్మ చరితార్థమైంది.

చివరగా

ఈ పోటీలో ప్రథమ బహుమతి, నా మనసును ఆకట్టుకున్న, సుస్వరంగా, మృదు మధురంగా గాయత్రిని ఆవాహనచేసి మన మనసుల్లో

ప్రతిష్టింపచేసిన చిరంజీవి శ్రీశైలమూర్తికి ఇవ్వాలని నిర్ణయం చేశాను. ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా శివం, రమణలకు లభించాయి.

పోటీలో పాల్గొన్న యువకులందరికి నూతన వస్త్రాలు బహుకరించమని నిర్వాహకులకు సలహా ఇచ్చాను. వారందరికి అలాగే ఇవ్వటం జరుగుతుంది.

పోటీలో పాల్గొన్న చిరంజీవులకు—

ఈ పోటీ నిర్వహించిన నిర్వాహకులకు, మరొకసారి అభినందనలు తెలియచేస్తున్నాను—స్వస్తి.''

ప్రథమ బహుమతి గ్రహీత శ్రీశైలమూర్తి కృతజ్ఞతలు చెప్పడానికి వేదిక ఎక్కాడు-

సభాయనమః.

పెద్దలందరికి నమస్సుమాంజలి.

న గాయత్ర్యాః పరం మంత్రం

న మాతుః పర దైవతం.

గాయత్రి కంటె గొప్ప మన్త్రము, తల్లికంటె గొప్ప దేవత లేదు.

అటువంటి గాయత్రీ మన్త్రం నేర్చుకుని అందులో పరిపూర్ణుణ్ణి అవ్వాలనుకున్నాను.

అయితే ఇక్కడ చిన్న విషయం పెద్దలందరికీ చెప్పాలి.

" గాయత్రీ వేద మాతాచ " గాయత్రి వేదములయొక్క తల్లి.

కె. బి. కృష్ణ

" బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చస్వాయ చారణాయ"

ఈ వేదవాణి బ్రాహ్మణులకును వలెనే క్షత్రియులకు, క్షత్రియులకెటో అట్లు వైశ్యులకు, శూద్రులకు తమ తమ పుత్రులకు, భృత్యులకు, అతి శూద్రులకు సయితము సమానముగా వర్తించునని శుక్ల యజుర్వేదమును బట్టి తెలుస్తోంది.

మానవుడు సంధ్యా కాలమందు, తక్కిన సమయములందు, ఏకాన్తమున, ఈ ఓంకారముతో కూడిన వ్యాహృతిత్రయాత్మకమైన గాయత్రిని, వేయి పర్యాయములు ప్రతి దినము జపించిన యెడల, ఒక మాసమునకు, సర్పము కుబుసము నుండి విడిపడునట్లు మహాపాపముల నుండి విడుదల నొందును అని మనుస్మృతి చెప్తోంది.

అలాగున నేను గాయత్రిని ధ్యానించాను.

చిన్మయానంద చెప్పినట్లుగా ధ్యానించు - ధ్యానించు — ధ్యానించు— మరియు ధ్యానించు. నీకు ఇదొక్కటేదారి. ఇదే - తొందరగా - చాలా సులభముగా, చౌకగా-భగవంతుని దగ్గరకు చేరుటకు ఇదే దారి.

ఈ మన్త్రమునకు అయోగ్యత అనే ప్రశ్నలేదు. ఏయే దైవమందు, యెవరెవరు ప్రీతి కలిగియుందురో, వారందరును అర్హత కలవారే, భక్తి శ్రద్ధలు గల్గి సత్యధర్మముల నాధారం చేసికొనియుంటె వారందరును యోగ్యతగలవారే.

నాకు ఇచ్చిన ఈ బహుమతి గాయత్రీదేవికి ఇచ్చినట్లుగా.

నాకు జరిగిన ఈ గౌరవం ఆ మహాతల్లి వేదవాణికి జరిగినట్లుగా భావిస్తున్నాను.

ఇది అంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే.

ఉదయం నుండి ఈ నిర్వాహకులకు నేను అబద్ధం చెప్పి, ఈ పోటీలో ప్రథమ బహుమతి సంపాదించేను.

నా చిన్నతనంలో, నన్ను ఇప్పుడు శ్లాఘించి ప్రథమ బహుమతికి ఎంపిక చేసిన వేదపండితులను, నేను కలుసుకుని 'నాకు గాయత్రి నేర్పండి' అని అర్థించేను. కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడి బ్రాహ్మణేతరులకు నేర్పనని వారు నిరాకరించేరు. ఆనాడే కంకణం కట్టుకొని గాయత్రి నేర్చుకుని ధన్యుణ్ణి అవాలని అనుకున్నాను.

గాయత్రి మహాతల్లి నా నరనరాల్లో ప్రవహిస్తూండటం వలన, నా ముఖంలో వర్చస్సు చూసి నన్ను ఎవరూ ఏమీ ప్రశ్నించలేదు.

నా కులం——

అని ఆ యువకుడు తన కులం చెప్పగానే సభలో కలకలం చెలరేగింది.

పోలీసులు కాల్పులు జరుపుతున్నారంటే ప్రజలు ఎలా పరుగులు పెడతారో అంతకన్నా వేగంగా నేను, నా కుమార్తె గాయత్రీ లేచి బయటకు వచ్చేశాము, కారణం నా మనసు నన్ను సర్దిచెప్పుకోనివ్వటం లేదు. మరి అతని ముఖం నేను చూడలేను. చూడను.

సభలో కరతాళ ధ్వనులు వినిపిస్తున్నాయి.

('యువ' మాసపత్రిక – జనవరి 1983)